సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం। 8। ఏప్రిల్। 2025


పట్టాభిషేకానికి హాజరైన భక్తజనం

రాజాధిరాజుగా..


శ్రీరామ పట్టాభిషేక వేడుకతో భద్రగిరి అయోధ్యపురిగా మారింది. గోదావరి నదీ తీరం సరయూ నదిని తలపించింది. త్రేతాయుగం మరోసారి భద్రాచలం నేలపై సాక్షాత్కరించింది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో కొలువుదీరిన రామయ్య రాజాధిరాజుగా, సామ్రాట్‌గా సోమవారం భక్తులకు దర్శనమిచ్చాడు. పాంచరాత్ర ఆగమ శాస్త్రాలను అనుసరిస్తూ నిర్వహించిన పట్టాభిషేకం వేడుకకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీరాముడికి పట్టువస్త్రాలు సమర్పించారు.

– భద్రాచలం


స్వామి వారి పాదుకలు


స్వామివారి గద


శ్రీరామ పట్టాభిషేక ప్రక్రియ నిర్వహిస్తున్న అర్చకులు


రాజముద్రిక


పచ్చలహారం


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


స్వామివారి కిరీటం

వైభవంగా సాగిన శ్రీరామ పట్టాభిసేకం

- అయోధ్యపురిగా మారిన మిథిలా స్టేడియం
- రాజదండం, రాజముద్రిక, రాజ ఖడ్గాలకు పూజలు
- సిరియపాదుక శ్రీ ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు
- పట్టాభిషేకానికి హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఆలయం నుంచి మిథిలా స్టేడియానికి..

పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని సీతాసమేత శ్రీరాముడు లక్ష్మణుడితో కలిసి భక్తుల కోలాహలం నడుమ ప్రధాన ఆలయం నుంచి ప్రత్యేక పల్లకీలో ఉదయం 10:17 గంటలకు మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. అర్చకులు మొదట విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. ఆ తర్వాత శ్రీరాముడికి పట్టాభిషేకం చేసేందుకు వీలుగా పండితులు రుత్విక్కులైన వశిష్టుడు, వామదేవుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడిని తమలో ఆవాహన చేసుకున్నారు.

హనుమంతుని మెడలో ముత్యాల దండ..

రామయ్య పట్టాభిషేకం అనంతరం రామయ్యకు ముత్యాల దండ ధరింప చేశారు. ఇదే దండను సీతాదేవి మెడలోనూ ధరింపచేశారు. చివరకు అదే దండను ఆంజనేయుడి మెడలో వేశారు. దీంతో శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం ముగియగా.. పట్టాభిషేకం అనంతరం సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యకు తాతగుడి సెంటర్ వరకు రథోత్సవం నిర్వహించారు. రథస్థం రాఘవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' అని బ్రహ్మ పురాణం చెబుతోందని, రథోత్సవంలో శ్రీ రాముడిని సేవించిన వారికి ముక్తి లభిస్తుందని అర్చకులు వివరించారు.

మండప్రతయ ఆరాధన..

రుత్విక్కరణం తర్వాత పండితులు మండపత్రయ పూజలు ప్రారంభించారు. శ్రీరాముడి పట్టాభిషేకానికి సమస్త దేవతలు, సమస్త నదీ, సముద్ర జలాలతో పాటు రామపరివారాన్ని ఆవాహన చేయడం ఈ మండపత్రయ ఆరాధన ప్రధాన ఉద్దేశం. పట్టాభిషేకం వేదిక దిగువ భాగాన మూడు కలశాలను ఏర్పాటు చేశారు. మధ్య కలశంలో సముద్ర, నదీ జలాలను ఆవాహన చేశారు. ప్రధానంగా తూర్పున పూరీ, దక్షిణాన ధనుష్కోటీ, పశ్చిమాన ద్వారకకు చెందిన సముద్ర జలాలు అవాహన చేయగా ఆగ్నేయం నుంచి గంగా, నైరుతి నుంచి కృష్ణా, వాయువ్యం నుంచి గోదావరి, ఈశాన్యం నుంచి కావేరీ నదీ జలాలను ఆవాహన చేశారు. నదీ, సముద్ర జలాలను ఆవాహన చేసిన కలశానికి కుడివైపున ఉన్న కలశంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పాటు రామపరివారాన్ని ఆవాహన చేశారు. ఇందులో తూర్పున హనుమ, పడమర లక్ష్మణ, ఉత్తరాన శతృఘ్నుడు, దక్షిణాన భరతుడు, ఆగ్నేయంలో అంగదుడు, వాయువ్యంలో సుగ్రీవుడు, ఈశాన్యంలో విభీషణుడు, నైరుతిలో జాంబవతుడిని ఆవాహన చేశారు. ఎడమవైపు కలశంలో అష్టదిక్పాలకులను ఆవాహన చేశారు. పట్టాభిషేకం చేసే రాజముద్రికలో లక్ష్మీదేవిని, రాజదండంలో విశ్వక్సేనుడిని, చామరలో వైనతేయుడు, గరుత్మంతుడు, ఖడ్గంలో నందకుడు, స్వర్ణఛత్రంలో అనంతుడు, పాదుకల్లో ఆదిశేషుడు, దేవేరులు ధరించే ఆభరణాల్లో భూదేవిని ఆవాహన చేశారు. మండపత్రయ ఆరాధాన ముగిసిన తర్వాత శ్రీరాముడికి అష్టోత్తర శతనామార్చన చేశారు. అనంతరం త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి ఆనాటి శ్రీరాముడి పాలన విశిష్టతలను వివరించారు.

సిరియ తిరువుడి పట్టాభిషేకం..

వాల్మీకి రామయాణంలో పట్టాభిషేకానికి ముందు రోజు శ్రీరాముడు అయోధ్యను వదిలి వనవాసానికి వెళ్లారు. దీంతో ముందుగా శ్రీరాముడి పాదుకలకు పట్టాభిషేకం జరిగింది. ఆ తర్వాత రామయణ క్రమంలో సుగ్రీవుడికి, విభీషణుడికీ పట్టాభిషేకాలు జరిగాయి. ఆ తర్వాతే శ్రీరామ పట్టాభిషేకం జరిగింది. అయితే విష్ణువుకు అన్ని అవతారాల్లోనూ గరుత్మంతుడు సేవలు అందించగా రామావతారంలో మాత్రం హనుమంతుడు సేవ చేశాడు. దీంతో గరుత్మంతుడిని పెరియ తిరువుడిగా, హనుమంతుడిని సిరియ తిరువుడిగా కొలుస్తారు. శ్రీరాముడి పాదుకలతో మొదలైన పట్టాభిషేక మహోత్సవం సిరియ తిరువుడైన హనుమంతుడి పట్టాభిషేకంతో ముగిసింది.

పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్

శ్రీరామ పట్టాభిషేక మహోత్సవానికి ప్రభుత్వం తరపున గవర్నర్ పట్టువస్త్రాలు అందించడం ఆనవాయితీ. ఈ క్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. ఉదయం 10 గంటల సమయంలో హెలీకాప్టర్ ద్వారా సారపాకలోని ఐటీసీ ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా నేరుగా ప్రధాన ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పట్టాభిషేకం జరిగే అయోధ్యాపురికి చేరుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, భద్రాచలం, ఇల్లెందు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజ లాంఛనాలతో పట్టాభిషేకం..

పట్టాభిషేక రాజ లాంఛనాల అలంకరణ మధ్యాహ్నం 12 గంటలకు మొదలైంది. ముందుగా రాజదండాన్ని శ్రీరాముడి కుడిచేతిలో ఉంచారు. ఆ తర్వాత రాజముద్రిక తొడిగారు. రామదాసు చేయించిన పచ్చల పతకాన్ని శ్రీరాముడికి, చింతాకు పతకాన్ని సీతాదేవికి, రామమాడను లక్ష్మణుడికి అలంకించారు. శ్రీరాముడికి ఇరువైపులా చామరాలు ఉంచి, ఆపై స్వర్ణఛత్రాన్ని స్థిరం చేశారు. చివరగా రాజఖడ్గాన్ని రామయ్య ఎడమ చేతిలో ధరింపజేశారు. స్వర్ణ ఛత్రం నీడలో రాజముద్రిక, రాజదండం, రాజఖడ్గం ధరించిన తర్వాత పట్టాభిషేకం కార్యక్రమాన్ని రుత్విక్కులు ప్రారంభించారు. మండపత్రయంలోని మూడు కలశాల్లోని సమస్త దేవతలు, సమస్త జలాలు, రామపరివారంతో కూడిన మంత్రించిన జలాన్ని శ్రీరాముడిపై ప్రోక్షణ చేస్తూ పట్టాభిషేకం కార్యక్రమాన్ని జరిపి చివరగా మంగళహారతి సమర్పించారు.


పట్టాభిషేకాన్ని తిలకిస్తున్న గవర్నర్, మంత్రి తుమ్మల, కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు



ఆదివాసీ సంస్కృతి అందరికీ తెలియాలి

- గిరిజన మ్యూజియం ప్రారంభోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- గుడ్ జాబ్ అంటూ పీఓకు కితాబు


మ్యూజియాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్, మంత్రి తుమ్మల

భద్రాచలంటౌన్: ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలకు ఎంతో ప్రాచుర్యం ఉందని, వాటి ప్రత్యేకతలు అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో నిర్మించిన గిరిజన మ్యూజియాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మ్యూజియంలో పొందుపర్చిన ప్రతీ వస్తువు విలువైనదని, వీటిని సేకరించడం గొప్ప విషయమని అన్నారు. పూర్వీకులు ఎలాంటి జీవనం గడిపారో ఈ వస్తువులను చూస్తే అర్థమవుతోందని అన్నారు. పూర్వపు గుర్తులతో పాటు ఆదివాసీ పల్లెలు గుర్తొచ్చేలా ఆహ్లాద వాతావరణం సృష్టించడం అభినందనీమన్నారు.

గుడ్‌జాబ్ అంటూ కితాబు..

ఆదివాసీల అచార వ్యవహారాల వస్తువులను సేకరించి ఒకచోట చేర్చడం సామాన్యమైన విషయం కాదని, 'గుడ్ జాబ్' అంటూ పీఓ రాహుల్‌ను గవర్నర్ అభినందించారు. మ్యూజియాన్ని మరింతగా అధునికీకరించేలా కృషి చేసి పర్యాటకులు, సందర్శకుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వంటలు బాగున్నాయి..

మ్యూజియం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులోని స్టాళ్లను సందర్శించిన గవర్నర్.. ఆదివాసీ వంటకాల్లో బొద్ది కూర పచ్చడిని రుచి చూసి బాగుంది అన్నారు. 'తెలుగు రాక రుచి చెప్పలేకపోతున్నా దీన్ని ఏమంటారు' అని ఇంగ్లిష్‌లో అడిగారు. భాష రాక మాట్లాడలేక పోతున్నా.. ఏమీ ఎనుకోకండి అని ఆదివాసీ మహిళలతో అన్నారు. ఈసారి తెలుగు నేర్చుకుని వచ్చి అన్ని వంటల రుచులు చెబుతానని అనగా.. మహిళలు గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వారు తయారు చేసి మూలికల అయిల్, ఇప్ప లడ్డూలతో పాటు పలు రకాల స్వీట్లు గవర్నర్‌కు ఇవ్వగా వాటికి డబ్బు చెల్లించారు. కార్యక్రమంలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్, పీఓ బి.రాహుల్, ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోయ భాషలో పలకరించిన తుమ్మల

మ్యూజియం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. గవర్నర్‌కు స్వాగతం పలికేందుకు వచ్చిన విద్యార్థులతో కోయ భాషలో మాట్లాడి ఆకట్టుకున్నారు. 'నాటే చదవ మిన్నారే.. రోడ్డుకు మంచిక మిన్నాకే' అంటూ కోయభాషలో యోగక్షేమాలు తెలుసుకున్నారు. మంత్రి తుమ్మల కోయ భాషలో అనర్గళంగా మాట్లాడగా అందరూ ఆసక్తిగా విన్నారు.

సమష్టి కృషితోనే విజయవంతం

భద్రాచలంటౌన్/భద్రాచలంఅర్బన్ : జిల్లా అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకలు విజయవంతం అయ్యాయని దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పెద్ద ఎత్తున భక్తులు వచ్చినా అందరికీ సౌకర్యాలు కల్పించారని అభినందించారు. స్వామివారి తలంబ్రాలు కొరియర్, పోస్టల్, కార్గో ద్వారా పొందే అవకాశం ఉన్నందున భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరగడం పట్ల కలెక్టర్ జితేష్ వి పాటిల్ హర్షం వ్యక్తం చేశారు. తమ సలహాలు, సూచనలు పాటిస్తూ వేడుకల విజయవంతానికి సహకరించిన వారందరినీ అభినందించారు. అలాగే వేడుకల్లో సమర్థంగా విధులు నిర్వర్తించిన 21 మంది ఎంపీవోలను, 101 మంది పంచాయతీ కార్యదర్శులను డీపీఓ చంద్రమౌళి అభినందించారు. పట్టాభిషేకం పూర్తయ్యాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు.

రోజుకు 8 గంటలు పనిచేయాలి

- యంత్రాల వినియోగం పెంచాలి
- 1000 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళికలు
- సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ వెల్లడి


క్యాంటీన్‌లో వసతులపై కార్మికులను ఆరా తీస్తున్న సీఎండీ బలరామ్, అధికారులు

మణుగూరు టౌన్: ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించాలంటే కార్మికులు రోజుకు ఎనిమిది గంటలు పనిచేయాలని, యంత్రాల వినియోగాన్ని 22 గంటలకు పెంచాలని సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ అన్నారు. సోమవారం ఆయన మణుగూరు ఏరియాలోని పీకేఓసీ, కొండాపురం భూగర్భగని, మణుగూరు ఓసీలను సందర్శించారు. ఓసీ–2లో నూతన సైట్ ఆఫీస్‌తో పాటు కేపీయూజీ మైన్ రెస్క్యూ స్టేషన్‌ను, ఓసీ–4 ఫ్రీ వెయిట్ ట్రక్ లోడింగ్ సిస్టంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యంత్ర సామర్థ్య వినియోగంలో పీకేఓసీ ఉత్తమ గని అవార్డు సాధించడం అభినందనీయమని, కార్మికులు, అధికారులు ఇదే ఒరవడి సాగించాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని అధిగమించి 127 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడం హర్షణీయమన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ సంస్థలు, కోలిండియా నుంచి సింగరేణికి గట్టి పోటీ ఎదురవుతోందని, దీన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కొత్త బ్లాక్‌ల కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌తో పాటు కొత్తగూడెం వీకే, ఇల్లెందులోని రొంపేడు ఓసీ, గోలేటి(బెల్లంపల్లి) ఓసీలను ప్రారంభించేలా అడుగులు వేస్తున్నామని చెప్పారు. సింగరేణి వ్యాప్తంగా 245.5 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని, వీటిని 1000 మెగావాట్లకు పెంచాలని యోచిస్తున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోనూ వివిధ రంగాల వ్యాపార విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. సంస్థ నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మణుగూరు పీవీ కాలనీ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్‌సీ సిలబస్ ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో స్పెషలిస్ట్ డాక్టర్లు, గైనకాలజిస్ట్, పీడియాట్రీషియన్‌ను నియమిస్తామన్నారు. అంతకుముందు కార్మికులతో కలిసి క్యాంటీన్‌లో అల్పాహారం చేసి నాణ్యతపై ఆరా తీశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సత్యనారాయణ, ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఏరియా జీఎం దుర్గం రాంచందర్, జీఎంలు సురేశ్, శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఓటు డైరెక్టర్ కేవీరావు, ఏజీఎం బొజ్జ రవి, అధికారులు లక్ష్మీపతిగౌడ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి, వెంకట్రావ్, రమేశ్, శ్రీనివాస్, అనురాధ, బాబుల్ రాజ్, యూనియన్ నాయకులు రాంగోపాల్, కృష్ణంరాజు, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా యూసీఈ

- అప్‌గ్రేడ్ చేస్తూ జీఓ జారీ చేసిన ప్రభుత్వం
- కొత్తగూడేనికి ప్రత్యేక గుర్తింపు
- అందుబాటులోకి కొత్త కోర్సులు


కొత్తగూడెంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(యూఈసీ – కేయూ)ను ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఇటీవల జీఓ జారీ చేసింది. ఈ కళాశాల దాదాపు 400 ఎకరాల్లో విస్తరించి ఉండగా 300 ఎకరాల్లో యూనివర్సిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. రాష్ట్ర విద్యార్థులు ఇన్నాళ్లు ఎర్త్ సైన్సెస్ కోర్సు చదవాలంటే సెంట్రల్ యూనివర్సిటీలకు వెళ్లాల్సి వచ్చేది. కొత్తగూడెంలోనే ఈ కోర్సులు అందుబాటులోకి రానుండడంతో విద్యార్థుల ఇక్కట్లు తీరనున్నాయి. ఇతర ప్రాంతాలతో పోలిస్తే జిల్లా వాతావరణం కొంత భిన్నంగా ఉంటుంది. ఇక్కడ ఎండ, వాన, చలి అన్నీ ఎక్కువే. ఇక అలాంటివాటిపై అధ్యయనం చేసే అవకాశం విద్యార్థులకు దక్కనుంది. యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు సీఎంకు వినతులు ఇవ్వగా ఇప్పుడు ఆయన కృషి ఫలించినట్టయింది. సహజ వనరులు, మినరల్స్ ఉన్న కొత్తగూడెంలో యూనివర్సిటీ ఏర్పాటుతో ప్రత్యేక గుర్తింపు లభించనుంది. రాష్ట్రంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ జిల్లాకు మంజూరు కావడంతో విద్యార్థులు, అధ్యాపకులు సంబరాలు జరుపుకున్నారు. కొత్తగూడెం ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం సింగరేణి, వివిధ కంపెనీల్లో పని చేస్తున్న వారు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికులకు ఉపాధి అవకాశాలు..

ఇంజనీరింగ్ కళాశాల విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ కానుండగా అత్యున్నత ప్రమాణాలతో వేలాది మందికి విద్య, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వేల సంఖ్యలో యువ శాస్త్రవేత్తలు ఇక్కడి నుంచే దేశ భవిష్యత్‌కు బాటలు వేసే అవకాశం ఉంటుంది. ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్లతో జిల్లాకు జాతీయస్థాయిలో పేరు రానుంది. ఈ యూనివర్సిటీలో జియో కెమిస్ట్రీ, జియో ఫిజిక్స్, ప్లానెట్రీ జియాలజీ, జియో మేరపాలజీ, స్ట్రక్చర్ జియాలజీ, ఖనిజ శాస్త్రం, పర్యావరణ భూగర్భ శాస్త్రం వంటి పలు కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. బోధన, బోధనేతర సిబ్బంది సంఖ్యా పెరగనుంది.

కేయూ నుంచి విడిపోనుంది..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో ఈ కాలేజీ కేయూ నుంచి విడిపోనుంది. 1978లో స్కూల్ ఆఫ్ మైన్స్‌గా ఓయూ పరిధి నుంచి కొత్తగూడెంలో పీజీ సెంటర్ ఏర్పాటైంది. తొలినాళ్లలో బీఈ మైనింగ్‌తో పాటు ఎమ్మెస్సీ జియాలజీ కోర్సులు ఉండగా, కేయూ ఏర్పాటయ్యాక 1996లో ఆ పరిధిలోకి చేర్చి కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీగా మార్చారు. ఆ సమయాన ఈఈఈ, సీఎస్ఈ, 2010లో ఐటీ, ఈసీఈ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చినా మధ్యలో ఎమ్మెస్సీ జియాలజీ కోర్సు తొలగించారు. ఇప్పుడు కేయూ నుంచి విడిపోతున్నందున బోధన, బోధనేతర పోస్టులే కాక కాలేజీ ఆస్తులన్నీ బదలాయిస్తారు. ఇంజనీరింగ్ కాలేజీలో 41 అధ్యాపకుల పోస్టులకు గాను ప్రస్తుతం 16మంది రెగ్యులర్, మిగతా వారు కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారు. 106 నాన్‌టీచింగ్ పోస్టులకు 60 మంది పనిచేస్తున్నారు. వర్సిటీగా అప్‌గ్రేడ్ కాగా పోస్టులు పెరిగే అవకాశముంది. ఇక ఈ కాలేజీలో నియామకమైన అసోసియేట్ ప్రొఫెసర్లు బిక్షాలు, వెంకటరమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాధిక, సుమలత కేయూలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం వీరి డిప్యూటేషన్లు రద్దు చేస్తారా, ఆప్షన్ ఇస్తారా అన్నది తేలాల్సి ఉంది.

అభివృద్ధికి కేంద్రం అవుతుంది



కొత్తగూడెం ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తుండడం హర్షణీయం.యూనివర్శిటీ ఏర్పాటుతో విద్యార్థులు జియాలాజీ, ఎలక్ట్రికల్, మైనింగ్, వాతావరణ శాఖ, అప్‌లైడ్‌ఫిజిక్స్, క్వాంటం ఫిజిక్స్ వంటి కోర్సుల్లో అధ్యయనం చేసే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్‌తో పాటు కొత్తగూడెం ప్రాంతం కూడా ఇంకా అభివృద్ధి చెందుతుంది.

– జగన్మోహన్‌రాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్

అందరికీ మేలు జరుగుతుంది



ఎర్త్ సైన్సెస్ యూనివర్శిటీతో అందరికీ మేలు జరుగుతుంది. ఇంజనీరింగ్ తరువాత ఎర్త్ సైన్సెస్ కోర్సుల్లో చేరాలంటే రాష్ట్రాలు దాటి వెళ్లాల్సి వస్తోంది. అక్కడ సీట్లు దొరుకుతాయో, లేదో తెలియదు. ఎందరికో సమయం, డబ్బు వృథా అయింది. కొత్తగూడెంలో యూనివర్సిటీ వస్తే విభిన్న కోర్సులు ఎంపిక చేసుకునే అవకాశముంటుంది.

– వి.సృజన, ఈఈఈ విద్యార్థిని

శాస్త్రవేత్తలుగా..



ఇంజనీరింగ్ కళాశాల అప్‌గ్రేడ్ కావడం సంతోషం. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో ఏర్పాటయ్యే కొత్త కోర్సుల్లో చేరి విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుంది.

– నివేదిత, సీఎస్ఈ విద్యార్థిని

పెదవాగు మరమ్మతులకు ఓకే..

- జీఎంఆర్‌బీ సమావేశంలో చర్చ
- రూ.15 కోట్లతో తక్షణమే తాత్కాలిక రిపేర్లు
- వచ్చే ఏడాది పునర్ నిర్మించాలని నిర్ణయం

అశ్వారావుపేటరూరల్: పెదవాగు ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మతులకు ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హైదరాబాద్‌లోని జలసౌధలో సోమవారం జరిగిన జీఆర్ఎంబీ(గోదావరి నదీ యాజమాన్య బోర్డు) సమావేశంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అధికారులు హాజరు కాగా.. ప్రాజెక్టు మరమ్మతులు, పునర్ నిర్మాణంపై చర్చించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు రూ.15 కోట్లు అవసరమని, ఆయకట్టు విస్తీర్ణం ప్రకారం ఇరు రాష్ట్రాలు ఈ వ్యయాన్ని భరించాలని నిర్ణయించారు. ఈ నిధులతో తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ఈ సీజన్ పంటలకే సాగునీరు అందించాలని, వచ్చే ఏడాది నాటికి పునర్నిర్మించాలని నిర్ణయానికి వచ్చారు.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం..

అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్టు కింద ఉమ్మడి రాష్ట్ర పరిధిలో భూములు సాగవుతున్నాయి. గతేడాది జూలై 18న కురిసిన భారీ వర్షాలు, వరదతో ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు సుమారు 250 మీటర్ల మేర భారీ గండ్లు పడిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు పరిధిలో అశ్వారావుపేటతో పాటు ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 16వేల ఆయకట్టు ఉంది. జీఆర్ఎంబీ సమావేశంలో మరమ్మతులకు నిధులు కేటాయించడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లువెత్తుతోంది. కాగా, ఈ సమావేశం నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. బోర్డు సమావేశంలో పెదవాగుపై చర్చించి ఈ పంట సీజన్‌లో ఆయకట్టు రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకున్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌జెండర్లను గౌరవంగా చూడాలి


ఉచిత బియ్యం అందజేస్తున్న జడ్జి భానుమతి

కొత్తగూడెంటౌన్: ట్రాన్స్‌జెండర్లను, సెక్స్ వర్కర్లను అందరూ గౌరవించాలని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి అన్నారు. సోమవారం కొత్తగూడెంలోని భవిత సెంటర్‌లో ట్రాన్స్ జెండర్లు, సెక్స్ వర్కర్లకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. న్యాయమూర్తి బియ్యం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతీ నెల ఉచితంగా బియ్యం ఇస్తామని, పంపిణీ కార్యక్రమం సజావుగా సాగేలా చూడాలని సెక్యూర్ ఎన్జీఓ ప్రాజెక్టు మేనేజర్ రాజేంద్రప్రసాద్‌ను ఆదేశించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. నిరంజన్‌రావు, సెక్యూర్ ఏన్జీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వీసీలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: ఈదురు గాలులు, భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో గోదావరి పరీవాహక ప్రాంతాల విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సోమవారం ఆయన 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి పరిధిలో ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరాను పరిశీలిస్తూ అంతరాయం ఎదురైతే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడినా, ట్రిపింగ్, బ్రేక్‌డౌన్లు వచ్చినా త్వరగా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే, పంట కోతలు జరుగుతున్నందున పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీసుల మంజూరులో వేగం పెంచాలని, అవసరమైన చోట 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సీఎండీ ఆదేశించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి మ్యాక్స్ అండ్ సైన్స్ క్విజ్ కార్యక్రమం ముగింపు ఉత్సవానికి డీఈఓ వెంకటేశ్వరాచారి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్రీయ ఆవిష్కార అభియాన్ కార్యక్రమంలో భాగంగా 8, 9తరగతుల విద్యార్థులకు జిల్లాస్థాయిలో మ్యాథ్స్, సైన్స్ క్విట్ పోటీలు నిర్వహించారు. 9వ తరగతి విభాగంలో సీహెచ్.రేణుక, లక్ష్మీమణి, ఎస్.సుబ్రహ్మణ్యం, ఎం.భరత్ చంద్ర, 8వ తరగతి విభాగంలో బి. జాహ్నవి, కే.భవ్య శ్రీ, ఎన్.గీతిక బహుమతులు గెలుచుకున్నారు. డీఈఓ బహుమతులు అందించి మాట్లాడారు. పోటీలకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థులు హాజరుకాగా, కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు ఏ.నాగరాజశేఖర్, ఎస్కే సైదులు, ఎన్.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

నవమితో ఆర్టీసీకి ఆదాయం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఈ నెల 6,7వ తేదీల్లో జరిగిన శ్రీ రామనవమి, పట్టాభిషేకం సందర్భంగా ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపింది. దీంతో భద్రాచలం డిపోకు సుమారు రూ.9.5 లక్షల ఆదాయం పెరిగింది. సాధారణంగా భద్రాచలం డిపో పరిధిలో రోజూ 92 సర్వీసులు నడుపుతుండగా, రూ. 23 లక్షల వరకు ఆదాయం వస్తుంది. శ్రీరామనవమి సందర్భంగా 5న అదనంగా మరో 26 సర్వీసులు తిప్పగా రూ.3 లక్షల మేర ఆదాయం పెరిగింది. 6న అదనంగా 30 సర్వీసులు నడపగా రూ. 4.50 లక్షలు, 7వ తేదీన అదనంగా 16 సర్వీసులు నడపగా రూ. 2 లక్షల వరకు ఆదాయం పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

ఇల్లెందు: ఇల్లెందు మండలం ధనియాలపాడు సమీపాన జామాయిల్ తోటలో ఓ వ్యక్తి ఆత్మహత్య పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కారేపల్లి మండలం చెన్నంగులగడ్డకు చెందిన డి.సురేష్(38) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబంలో గొడవలు జరుగుతుండగా, సోమవారం ధనియాలపాడు సమీపాన జామాయిల్ తోటలో ఉరి వేసుకున్నాడు. ఘటనపై ఆయన భార్య వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

సమన్వయంతో సాఫీగా..

- భద్రాచలంలో ఘనంగా ముగిసిన శ్రీరామనవమి, పట్టాభిషేకం
- పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, సమీక్షించిన మంత్రులు పొంగులేటి, తుమ్మల


స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఆలయ ఈఓ రమాదేవి, ఉద్యోగులు

భద్రాచలం: రామభక్తులంతా భక్తితో ఎదురుచూసిన శ్రీరామనవమి వేడుకలు భద్రాచలంలో ఘనంగా జరిగాయి. పట్టాభిషేకం కార్యక్రమంతో ముఖ్య ఘట్టాలన్నీ పూర్తయ్యాయి. వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామనవమి తిరుకల్యాణోత్సవాలు గత నెల 30న మొదలుకాగా, ఈ నెల 6న శ్రీరామనవమి, సోమవారం పట్టాభిషేకం జరిగాయి. ఈ వేడుకలు చూసేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు భద్రాచలం చేరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు స్వయంగా ఈ వేడుకలకు హాజరై ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. దీంతో వేడుకల నిర్వహణకు జిల్లా యంత్రాంగం నెల రోజుల నుంచి శ్రమిస్తోంది.

ఎండ నుంచి ఉపశమనం

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో భద్రాచలం ఒకటి. మార్చి నుంచే ఇక్కడ మండే ఎండలు మొదలవుతాయి. ఈసారి నవమి వేడుకలు ఏప్రిల్ 6న రావడంతో ఎండ, ఉక్కపోత నుంచి భక్తులకు ఉపశమనం కలిగించేందుకు మిస్ట్ ఫాగ్ సిస్టమ్‌ను చలువ పందిళ్ల కింద ఏర్పాటు చేశారు. ప్రతీ పది నిమిషాలకు ఓసారి భక్తులపై సన్నని చిరుజల్లులు కురవడంతో ఎండ వేడిమి నుంచి భక్తులకు ఉపశమనం లభించింది. తొమ్మిదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి ఈ వేడుకలకు హాజరై పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. దేవస్థానం వెబ్‌సైట్‌ను ఆధునీకరించడంతోపాటు మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు.

తీరని సమస్యలు

భద్రాచలం వచ్చే భక్తులకు తాగునీరు అందించేందుకు నవమి రోజు వాటర్‌బాటిళ్లు విరివిగా అందుబాటులో ఉంచారు. కానీ ఒకరోజు ముందే సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భద్రాచలం చేరుకున్నారు. ఇక్కడే వండుకుని నిద్ర చేసి కల్యాణ వేడుకలు చూడాలనుకునే భక్తులకు నీటి సమస్య, వసతి సమస్య వేధించింది. ప్రతీసారి అందుబాటులో ఉండే భారీ తాత్కాలిక షెడ్లు 'ప్రసాద్' పనులతో ఈసారి కనిపించలేదు. వీఐపీ తాకిడి పెరగడంతో ఉభయ దాతల టికెట్లకు కోత పడింది. కొద్ది మంది ఖర్చు చేసి ఈ టికెట్లు కొనుగోలు చేసినా వీఐపీ గ్యాలరీ, లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్ల వల్ల వారికి కల్యాణవేదిక సరిగా కనిపించలేదు. ఎప్పటిలాగే మిథిలా స్టేడియం గ్యాలరీల్లో కూర్చున్న భక్తులకు పందిళ్లే అడ్డుగా వచ్చాయి. ఎల్ఈడీ తెరలపై కల్యాణ వేడుకలు వీక్షిస్తూ సంతృప్తి చెందాల్సి వచ్చింది. కరకట్ట, గోదావరి తీర ప్రాంతాలతో పాటుగా పట్టణంలో ముఖ్యకూడళ్లలో ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఊహించని స్థాయిలో భక్తుల రాక పెరగగా.. తాత్కాలిక వసతి లేక కరకట్ట, గోదావరి ఒడ్డునే సేద తీరారు.

సమష్టిగా కృషి..


కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్‌ను అభినందిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవమి వేడుకలను విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేశారు. మిథిలా స్టేడియంలో జరిగే పనులను మంత్రి పొంగులేటి స్వయంగా పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఆ తర్వాత నవమి ఏర్పాట్లపై మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజులు అధికారులతో సమన్వయం చేసుకున్నారు. నీటి, ట్రాఫిక్ సమస్యలు తప్పితే వేడుకలు సాఫీగా జరిగాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే తెల్లం, కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్

బూర్గంపాడు: భద్రాచలం శ్రీరామ పట్టాభిషేకానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సారపాకలో ఘనస్వాగతం లభించింది. సారపాకలోని ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్‌స్కూల్ ఆవరణలోని హెలీప్యాడ్‌కు చేరుకున్న గవర్నర్‌కు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కొద్దిసేపు గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకున్న అనంతరం భద్రాచలం రామాలయానికి వెళ్లారు. శ్రీరామ పట్టాభిషేకం అనంతరం ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు తిరిగి వచ్చిన అనంతరం కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని ఆ తరువాత హెలీప్యాడ్‌కు చేరుకుని హైదరాబాద్ వెళ్లారు.

రెడ్ క్రాస్ సేవలు విస్తృతపరచాలి

రెడ్ క్రాస్ సేవలు మరింతగా విస్తృతపరచాలని రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు జిష్ణుదేవ్ వర్మ సూచించారు. ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం గవర్నర్‌ను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం శాఖ ప్రతినిధులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా భద్రాచలం రెడ్‌క్రాస్ సొసైటీ చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం గవర్నర్ పలు సూచనలు చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు ఎస్ఎల్ కాంతారావు, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, రాజారెడ్డి, గాలిబ్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన సాగిందిలా...

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో సోమవారం గవర్నర్ పర్యటన 3: 31 గంటల పాటు సాగింది. ఉదయం 10:59 గంటలకు సారపాక ఐటీసీలోని బీపీఎల్ స్కూల్ హెలీప్యాడ్‌లో దిగారు. అనంతరం ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని, 11:28 గంటలకు అక్కడి నుంచి భద్రాచలానికి రోడ్డుమార్గాన బయల్దేరారు. 11:42 గంటలకు రామాలయం, లక్ష్మీతయారు అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు మిథిలా స్టేడియానికి చేరుకుని పట్టాభిషేకానికి హాజరయ్యారు. 12:55 గంటలకు మిథిలా స్టేడియం నుంచి బయల్దేరి ఐటీడీఏకు వెళ్లారు. అక్కడ గిరిజన మ్యూజియం ప్రారంభించి, 1:58 గంటలకు తిరిగి ఐటీసీ గెస్ట్‌హౌస్ చేరుకున్నారు. విశ్రాంతి అనంతరం హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు.

ఫిల్టర్‌బెడ్‌లో ఇసుక మార్పిడి


తాగునీటి ఫిల్టర్ బెడ్ (ఇన్ సెట్‌లో) చీరాల నుంచి తెప్పించిన రాళ్లు

- ఇల్లెందులో రూ.25 లక్షలతో సాగుతున్న పనులు
- సముద్ర తీరం నుంచి సేకరించిన గులక రాళ్ల వినియోగం
- తాగునీటి శుద్ధి వ్యవస్థ మెరుగయ్యేలా మరమ్మతు పనులు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్‌లో నీటిని శుద్ధి చేసే ఇసుకను మారుస్తున్నారు. పదిహేను రోజులుగా పనులు నిర్వహిస్తున్నారు. 2010లో ఫిల్టర్ బెడ్ నిర్మించి, అధునాతన గ్రావిట్ ర్యాపిడ్ ఫిల్టరేషన్ పద్ధతిలో తాగునీరు శుద్ధి చేస్తున్నారు. ఇల్లెందులపాడు తాగునీటి చెరువు నుంచి నీటిని తరలించి, ఇక్కడ శుద్ధి అనంతరం పట్టణంలోకి వదులుతున్నారు. అయితే ఫిల్టర్‌బెడ్‌లో నీటి శుద్ధి ప్రక్రియలో ఇసుకను నాలుగైదేళ్లకోసారి మార్చాల్సి ఉండగా, ప్రారంభం నుంచి ఇప్పటివరకు మార్చలేదు. ఎట్టకేలకు గత పాలకవర్గం రూ. 25 లక్షలు కేటాయించి ఇసుక మార్పిడి పనులు చేపట్టింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ గత 15 రోజులుగా మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఇందుకోసం చీరాలలోని సముద్ర తీరం నుంచి ఇసుక, గులకరాళ్లు తెప్పించారు. ఫిల్టర్‌బెడ్‌లో గులక రాళ్లు, ఇసుక పొరలు పొరలుగా అమర్చుతున్నారు. పొరలపై రా వాటర్ వదిలితే ఇసుక, రాళ్లు నీటిలోని మలినాలు, మడ్డిని ఫిల్టర్ చేస్తాయి. అనంతరం నీరు పైపుల నుంచి సంప్‌లో చేరాక, ప్రజలకు సరఫరా చేస్తారు. పేరుకుపోయిన మలినాలను నెలకోసారి తొలగిస్తారు. ఇక్కడ రెండు బెడ్‌లు ఉండగా, ఒకదానిలో మరమ్మతులు చేపడుతున్నారు. మరో బెడ్ నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం సాగుతున్న ఇసుక తొలగింపు ఫిల్టర్‌బెడ్ మీడియా చేంజ్ పనులు మరో 15 రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో 'రా'వాటర్ ఫిల్టరైజేషన్‌ను ఢోకా ఉండదు. కాగా పట్టణంలోని మూడొంతుల జనాభాకు ఈ ఫిల్టర్ బెడ్ నుంచే తాగునీరు సరఫరా చేస్తున్నారు.

వేగంగా చేపట్టాలి



పట్టణ ప్రజలకు నీరందించే ఫిల్టర్ బెడ్‌లో ఇసుక మార్పిడి ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలి. వేసవి కాలం కావడంతో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి. నాణ్యతలో రాజీ పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి. పట్టణవాసులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి.

– కొడారి రాజేందర్, ఇల్లెందు

మరో 15 రోజుల్లో పూర్తి..



మున్సిపల్ ఫిల్టర్‌బెడ్‌లో ఇసుక మార్పిడి ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇక్కడ రెండు బెడ్లు ఉండగా, ఒక బెడ్‌లో నీటిని నిలిపి వేసి, మరో బెడ్‌లో ఇసుక, రాయి లేయర్ల వారీగా వేస్తున్నాం. ఈ ప్రక్రియ మరో 15 రోజులో పూర్తి అవుతుంది. నీటి శుద్ధికి ఢోకా ఉండదు.

–సీహెచ్ శ్రీకాంత్, కమిషనర్, ఇల్లెందు

ఈదురు గాలులు.. వడగళ్లవాన


రామన్నగూడెం సమీపంలో ప్రధాన రహదారిపై విరిగిపడ్డ భారీ వృక్షం

అశ్వారావుపేటరూరల్: జిల్లాలో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన పడింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సోమవారం అశ్వారావుపేట మండలంలో అకాల వర్షం, గాలి దుమారం రావడంతో మామిడి, మొక్కజొన్న పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అశ్వారావుపేట, వినాయకపురం, మామిళ్లవారిగూడెం, ఆసుపాక, మల్లాయిగూడెం తదితర గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది. రామన్నగూడెం, పండువారిగూడెం, అనంతారం, నారాయణపురం, గాండ్లగూడెం గ్రామాల్లో పొలాల్లో ఉన్న మొక్కజొన్న, వేరుశెనగ, నాటు పొగాకు వర్షం కారణంగా స్వల్పంగా తడిసినట్లు రైతులు తెలిపారు. వాగొడ్డుగూడెం-రామన్నగూడెం మార్గంలో పలు చోట్ల ప్రధాన రహదారిపై వృక్షాలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

కూలిన విద్యుత్ స్తంభాలు

పాల్వంచరూరల్: మండలంలో ఉరుములు, మెరుపులతో కూడి భారీ వర్షం కురిసింది. గాలివానకు ఉల్వనూరు కొత్తూరు గ్రామాల మధ్య చెట్లు విరిగిపడ్డాయి. మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఏఈ రవీందర్ జగన్నాథపురం సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వర్షానికి వీధుల్లో వరద ప్రవహించింది. పంట పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం, మిర్చి రాశులు తడవకుండా పరదాలు కప్పుకుని రక్షించుకున్నారు. వర్షం రెండు రోజుల పాటు ఉంటుందని వాతవరణశాఖ హెచ్చరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


ఉల్వనూరు కొత్తూరు గ్రామంలో విరిగిన విద్యుత్ స్తంభం

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో గాలిదుమారం బీభత్సం సృష్టించింది. సోమవారం రాత్రి బలమైన గాలులు వీయడంతో రోడ్లపై చెట్లు విరిగిపడ్డాయి. రాకపోకలకు ఆటంకం కలిగింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మామిడి తోటలల్లో కాయలు రాలిపోయాయి. పలు గ్రామాల్లో ఇళ్లపై రేకులు లేచిపోయాయి. ఉరుములు, పిడుగులతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

ఇల్లెందు: ఇల్లెందులో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు, వర్షంతో 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కరెంట్ ఆఫీస్ వద్ద ఓ చెట్టు విరిగి కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో అంతరాయం ఏర్పడింది.

విరిగిపడ్డ చెట్లు


జగ్గారంలో ఈదురు గాలులకు నేలరాలిన మామిడి కాయలు

దమ్మపేట: మండలంలోని పలు చోట్ల ఉరుములు మెరుపులతో భారీగా వర్షం పడింది. దుమ్ముతో కూడిన ఈదురు గాలులు బలంగా వీచాయి. అంకంపాలెం, పట్వారిగూడెం, బాలరాజుగూడెం, జగ్గారం, మొద్దులగూడెం, మల్కారం గ్రామాల్లో వడగళ్లు పడ్డాయి. తీవ్రమైన గాలుల ప్రభావానికి బాలరాజుగూడెం, అంకంపాలెం గ్రామాల శివారులో రోడ్డుపై చెట్టు పడిపోగా, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పార్కలగండి ఆశ్రమ పాఠశాలలో పెద్ద చెట్టు వేళ్లతో సహ పక్కకు ఒరిగిపోయింది. మామిడి, మొక్కజొన్న పంటలకు స్వల్పం నష్టం జరిగింది.


అంకంపాలెం శివారులో రోడ్డుపై చెట్టు పడటంతో నిలిచిపోయిన వాహనాలు

మళ్లీ ట్రాఫిక్ పాట్లు


గవర్నర్ కాన్వాయ్ భద్రాచలం నుంచి సారపాక చేరుకున్నప్పటికీ ట్రాఫిక్‌ను నిలిపివేసిన పోలీసులు

వాహనాలు నిలిపివేయడంతో స్థానికుల అవస్థ

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో సోమవారం వీవీఐపీల తాకిడి పెద్దగా లేకపోయినా స్థానికులు ట్రాఫిక్‌పాట్లు తప్పలేదు. శ్రీరాముడికి పట్టాభిషేకం జరపగా, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకటరావు, కోరం కనకయ్య కూడా పాల్గొన్నారు. వీరితోపాటు ముగ్గురు, నలుగురు వీఐపీలు మాత్రమే ఉన్నారు. కానీ పోలీసులు మాత్రం ట్రాఫిక్ నిబంధనల పేరుతో ఆదివారం రాత్రి చాలా సేపు వరకు బారికేడ్లు తొలగించకుండా స్థానికులను ఇబ్బందికి గురిచేశారు. సోమవారం ఉదయం గవర్నర్ భద్రాచలం వచ్చే 20 నిమిషాల ముందు నుంచే బ్రిడ్జి సెంటర్‌లో ట్రాఫిక్ నిలిపివేయగా భక్తులు, ద్విచక్రవాహనదారులు ఎండ వేడి కారణంగా అవస్థ పడ్డారు. మిథిలా స్టేడియంలో పట్టాభిషేకం కార్యక్రమాన్ని గవర్నర్ ముగించుకుని ఐటీడీఏలో గిరిజన మ్యూజియాన్ని ప్రారంభించేందుకు బయలుదేరిన సమయంలో కూడా బ్రిడ్జి సెంటర్ నుంచి ఐటీడీఏ రోడ్డు వరకు అన్ని వాహనాలను ఆపేశారు. అనంతరం ఐటీడీఏలో కార్యక్రమాలను ముగించుకుని గవర్నర్ సారపాకకు తిరిగి వెళ్తున్న క్రమంలో మరోసారి ఐటీడీఏ నుంచి బ్రిడ్జి సెంటర్ వరకు ఉన్న కాలనీల వీధుల్లోని వాహనాలను మెయిన్ రోడ్డు మీదకు రాకుండా దాదాపు 20 నిమిషాల వరకు నిలిపివేశారు. భద్రాచలంలో 6,7 తేదీల్లో జరిగిన శ్రీరామనవమి, పట్టాభిషేకం కార్యక్రమాలలో పోలీసులు వ్యవహరించిన తీరుపట్ల వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో పాటు, భక్తులు, స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు.


బ్రిడ్జి సెంటర్‌లో వాహనాలను నిలిపివేసిన పోలీసులు

మందుపాతర పేలి టిప్పర్ డ్రైవర్‌కు గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో సోమవారం మందుపాతర పేలి ఓ టిప్పర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుతుల్-నారాయణపూర్ మార్గంలో రహదారి నిర్మాణ పనులు సాగుతుండగా, భద్రత కోసం వచ్చే పోలీసు బలగాలను మట్టుబెట్టేందుకు మావోయిస్టులు ప్రెజర్‌బాంబును ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతానికి రోడ్డు నిర్మాణ సామగ్రిని తీసుకువచ్చిన టిప్పర్ డ్రైవర్ గమనించకుండా బాంబుపై కాలు మోపడంతో అది పేలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నారాయణపూర్ ఆస్పత్రికి తరలించారు.

వట్టిపోతున్న గోదావరి


పర్ణశాల వద్ద నీళ్లు లేక వెలవెలబోతున్న గోదావరి

దుమ్ముగూడెం : మండలంలోని పర్ణశాల, కాశీనగరం, బైరాగులపాడు, దుమ్ముగూడెం వద్ద గోదావరిలో నీళ్ల తగ్గి ఇసుక మేటలు, రాళ్లు తేలి కనిపిస్తున్నాయి. ఏప్రిల్ నెల మొదటి వారంలోనే నది ఎండిపోతుండటం ఆందోళన కలుగజేస్తోంది. దుమ్ముగూడెం మండలం వద్ద గోదావరిలో ఎప్పుడూ నీళ్లు ఉండేవి. గత నెలలో సీతారామ ప్రాజెక్టు కోసం నీళ్లను లిఫ్ట్ చేయడంతో నది వెలవెలబోతోంది. ఫలితంగా తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉంది.

కత్తితో వ్యక్తి హల్‌చల్.!

అశ్వారావుపేటరూరల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి చేతిలో కత్తి పట్టుకుని వీరంగం సృష్టించిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడేనికి చెందిన సంధిపాముల ఆదయ్య తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి పక్కన కొంతకాలంగా కొబ్బరి బొండాలు విక్రయిస్తున్నాడు. సోమవారం అతిగా మద్యం తాగి కొబ్బరి బొండాలు కొట్టే కత్తి పట్టుకుని, ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారిని దుర్భాషలాడుతూ, హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు, వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

పెట్రోల్ చోరీ

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఇంటి ముందు నిలిపి ఉన్న రెండు ద్విచక్ర వాహనాల్లో గుర్తు తెలియని ఇద్దరు యువకులు పెట్రోల్ చోరీ చేశారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో వాహనాల నుంచి పెట్రోలు తీస్తుండగా సీసీ కెమెరాల్లో రికార్డయింది. కాగా పోలీసులు దృష్టిపెట్టి చోరీలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లిటౌన్: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం ములగలపాటి వారిగూడెంకు చెందిన కంటి వెంకటనారాయణ(70) బైక్‌పై సోమవారం వేంసూరు మండలం కుంచపర్తి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.